# సత్యవాక్కు

## క్రైస్తవ మాస పత్రిక

THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము!

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్యమాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
**(P.O. Box 80) Seshagiri Rao St.**
**KAKINADA-533 004**

—o—

## ప్రకటన

**Edward C. Warton** గారిచే ఆంగ్లములో రచించబడిన **The Church of Christ** అను పుస్తకము "క్రీస్తు సంఘము" పేరిట తెనిగించబడి సంఘములకు అందివ్వబడుచున్నది. పునర్ముద్రణలో ఆంగ్లములోని భావమును మరికొంత విశదపరచ గలిగినాము. దీని ఖరీదు ఎనిమిది రూపాయలు.

అయినను, బోధకులకు రూ. **1-50** కు ఇవ్వగలము.

కావలసినవారు ఈ క్రింది అడ్రసుకు వ్రాయండి:

టి. జ్ఞానానందము, క్రీస్తు సంఘము,
చర్చి స్క్వేర్, కాకినాడ - 533 002.

# సత్యవాక్యం

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P 533 001.

Editor : J.C. CHOATE | Managing Editor : JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 12 | అక్టోబరు 1991 | సంచిక 3

## సంపాదకీయము

### నాకాశ్చర్యము కలుగుచున్నది

### (I Marvel)

లోకము కొన్ని విషయముల యందు శ్రద్ధ, జ్ఞానమును కలిగి యుండి యితర విషయములయందు అశ్రద్ధగాను, అజ్ఞానముగాను ఉండుట నాకు ఆశ్చర్యమును విభ్రాంతిని కలిగించుచున్నది. భూమిని, విశ్వమును, గ్రహములను, నక్షత్రములను, గెలాక్సీలను మరియు సూర్యకుటుంబమును చూడండి. మిలియన్ల మరియు బిలియన్ల సంవత్సరములకు పూర్వము నేడు మనకు కనపడుచున్న సమస్తమును మరియు జీవకోటియు ఆకస్మిక సంఘటన ద్వారా ఉద్భవించి తరువాత సంపూర్ణ మానవుడుగా పరిణామము చెందెనని వాదన. ఏ సాధారణ వ్యక్తి అయినా ఇంతకంటె బాగుగా ఆలోచించగలడు. ఇదంతయు దేవుని సృష్టి అన్నే భావనకు దూరమై మానవు డెందుకిట్టి ఆలోచనలు కలిగి యున్నాడు? (ఆది 1:1). దావీదు ఈలాగు చెప్పెను. "దేవుడు లేడని బుద్ధిహీనులు తమ హృదయములో అనుకొందురు" కీర్త 14:1.

మనము అనేక విషయములను గమనించ వచ్చును. సూర్యుని చూడండి. సూర్య గ్రహము తన స్థానములో లేకపోయిన యెడల ఏమి జరుగును? అది భూమికి ఇంకనూ కొంచెము దగ్గరగానుంటే ఏమగును? సూర్యునికి భూమికీ మధ్య దూరంలో తేడా వచ్చినట్లయితే మనము గడ్డకట్టుకొని పోవుటయో లేక భస్మమగుటయో సంభవించును. దీని క్రమ మెట్లు వచ్చెను? దీనిని ఎవరు నడిపించుచున్నారు? ఏదో ఒక గొప్ప శక్తి వాటి నక్కడ ఉంచెను. వాటిని వాటి స్థానములో ఉంచే శక్తిని ఆయన కలిగియున్నాడు. ఆయనెవరు? దేవుడు తప్ప మరెవరో కాదు. మరియు దావీదు పూర్వము యిట్లు పలికెను: "యెహోవా దయాళుడు ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి. ఆయన కృప నిరంతరముండును ... ఆయన ఒక్కడే మహాశ్చర్య కార్యములు చేయువాడు. తన జ్ఞానముచేత ఆయన ఆకాశమును కలుగజేసెను. ఆయన భూమిని నీళ్ళమీద పరచినాడు. ఆయన గొప్ప జ్యోతులను నిర్మించినవాడు. పగటి నేలుటకు ఆయన సూర్యుని చేసెను. రాత్రి నేలుటకు ఆయన చంద్రుని నక్షత్రములనూ చేసెను. ఆయన కృప నిరంతర ముండును" కీర్త 136:1-9.

నీవు అందమైన పుష్పములు, మొక్కలు మరియు చెట్ల గురించి ఆలోచించితివా? అవి విత్తనము నుండి ఉద్భవించినవి. ప్రతి సంవత్సరము వాటివాటి కాలములో ప్రత్యుత్పత్తి జరుగుచూ పుష్పించుచున్నవి. అవి క్రమాన్ని తప్పవు. ఎప్పుడూ అవి ఒకే విధముగా ఉంటాయి. అవి ఎక్కడ నుండి వచ్చినవి? వీటిని ఇక్కడ ఎవరు ఉంచిరి? వస్త్రములవంటి మన భౌతిక అవసరముల కొరకు దేవుడు వాటిని మనకొరకు సిద్ధపరచి యుంచినట్లు లేఖనములు చెప్పుచున్నవి. యేసు ఉదాహరణగా ఈలాగు సెలవిచ్చెను. "వస్త్రములను గూర్చి మీరు చింతింపనేల? అడవి పువ్వులు ఏలాగు ఎదుగుచున్నవో ఆలో

చించుడి. అవి కష్టపడవు. ఒడకవు అయినను తన సమస్త వైభవముతో కూడిన సొలొమోను సహితము వీటిలో ఒకదానివలెనైనను అలంకరింపబడలేదు. నేడుండి రేపు పొయిలో వేయబడు అడవి గడ్డిని దేవుడీలాగు అలంకరించిన యెడల అల్ప విశ్వాసులారా మీకు మరి నిశ్చయముగా వస్త్రములు ధరింపజేయును గదా" మత్త 6:28-30.

ఆకాశ పక్షులున్నాయి. అవి అనేక రకాలు, రంగులు కలిగి యున్నాయి. అనేక శీతోష్ణస్థితులలోను, శత్రువుల మధ్య అవి జీవించుచున్నవి. వాటిని గూర్చి యేసు ఈలాగు సెలవిచ్చెను: "ఆకాశ పక్షులను చూడుడి. అవి విత్తవు కోయవు కొట్లలో కూర్చుకొనవు అయినను మీ పరలోకపు తండ్రి వాటిని పోషించుచున్నాడు. మీరు వాటికంటె బహు శ్రేష్టులు కారా?" మత్త 6:26.

భౌతికమైన జననము ముఖ్యముగా మానవ జననమును గూర్చి ఆలోచించుడి. ఇది నమ్మలేని నిజం. అది ఒక అద్భుతముగా వర్ణించవచ్చును గాని అది ప్రకృతి సిద్ధముగా జరుగుచున్నది. భౌతికమైన జననముతో పాటు క్రీస్తు క్రొత్త జన్మము లేక ఆత్మీయమైన జన్మమును గూర్చి యోహాను 3:3-5లో వివరించెను. ఇది నీటి మూలముగాను ఆత్మ మూలముగానైన జన్మ యని ఆయన చెప్పెను. మరో మాటలో చెప్పాలంటే ఒకడు విశ్వసించి, మారు మనస్సు పొంది, క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొని ప్రభువుతో పాటు నీటిలో బాప్తిస్మము పొంది నీటి సమాధినుండి తిరిగి లేచుటయే రక్షింపబడుట లేక ఆత్మీయ జన్మ. ఈ ఆత్మీయ జన్మ కూడ ఒక అద్భుతముగా తలంచబడుచున్నది గాని నిజానికి అద్భుతము కాదు. అది ఆత్మ సంబంధమైన చట్టమును బట్టి జరుగుచున్నది.

లోకము ఊహించలేని విషయాలతోను, ఆశ్చర్యమును, విభ్రాంతిని కలిగించే విషయములతోను నిండియున్నది. చాలా మంది

ఈ విషయమును గూర్చి ఆలోచించుటలేదు. ఇవన్నియు ఎట్లు జరుగు చున్నవి? వీటిని బట్టి ఒక ఉన్నత వ్యక్తి, సృష్టికర్త మరియు ఆధార భూతుడైన వానికి మనము భయపడవలెనని అవి తెలియజేయు చున్నవి. దేవుడున్నాడు. నేను వ్యక్తిగతముగా దేవుని ఆయన సృష్టిని గూర్చి ఆశ్చర్యపడుచున్నాను. దీనిని బట్టి మనము మనలను ఆయనకు సమర్పించుకొనవలసి యున్నది.

ప్రతిదినము మన జీవితాలలో జరిగే అనేక సంఘటనలలో దేవుని హస్తమున్నట్లు అవి తెలియజేయుచున్నవి. ఆయన మనలను ఆశీర్వదించు చున్నాడు, సంరక్షించు చున్నాడు, మనకొరకు ద్వారమును తెరచుచున్నాడు, క్షమించుచున్నాడు. మరియు ఇంకా అనేకమైన వాటిని ఆయన ద్వారా పొందుచున్నాము. అయినప్పటికిని మనము వాటివైపు చూచుట లేదు. మరల కొన్నిటిని పరిశీలించుదాం. కొన్నిసార్లు ఆయన ఆశీర్వాదా లను అదృష్టమని పిలుస్తున్నాము. లేక అవి పొందడానికి మా జ్ఞానమే కారణమని తలంచుచున్నాము. కాదు. అది దేవుని పని. అది అద్భుతముకాదు, మరేదీకాదు. ప్రభువు మన జీవితాలలో పని జరిగించుచున్నాడు. ముఖ్యముగా మనము ఆయన వారమైన యెడల పౌలు ఈలాగు చెప్పుచున్నాడు. "దేవుని ప్రేమించు వారికి, అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడిన వారికి, మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని యెరుగుదుము" రోమా 8:28.

అపును దేవుడు ఎల్లప్పుడును ఉన్నాడు. దేవుని చేతిపనిని బట్టి నేనాశ్చర్యపడుచున్నాను. దేవుని సృష్టియైయుండి వారి మనస్సు నందును మనస్సాక్షి విషయములోను దేవుని విడిచిపెట్టిన వారి విషయమై నేను మరింత ఆశ్చర్యపడుచున్నాను. నీవట్టి నాడవైతే

నిన్ను కొన్ని ప్రశ్నలడుగుచున్నాను. నీ ఉనికి ఎట్లు వచ్చెను? నీచుట్టు నీవు చూచుచున్నదేమి? ఈ జీవితము తరువాత ఏమి జరుగును? దేవుడు ఆయన వాక్యము నీ ప్రశ్నలకు జవాబని నేను నీకు చెప్పుటకు సంతోషించుచున్నాను. నీవు చిరకాలము జీవించుటకు జాగ్రత్తను కలిగియుండునట్లు దేవుడు తన దయను బట్టి యిచ్చిన రక్షణ మార్గమును చేపట్టుము. నీవు చూచుచున్న దానిని బట్టి నీకును ఆశ్చర్యము కలుగును.

—o—

## పరిశుద్ధాత్మ బాప్తిస్మమును గూర్చి నీ నమ్మక మెట్టిదో కాని....

పరిశుద్ధాత్మ బాప్తిస్మమును గూర్చి జనుల్లో సరియైన అవగాహన లేనట్టు కన్పిస్తుంది. అందువలనే అపోహాలు, అపార్థాలు వగైరాలు కలుగుతున్నాయి. పరిశుద్ధాత్మ బాప్తిస్మాన్ని గురించి నీకెలాంటి నమ్మకముందో కాని, ప్రభువు మరణానంతరం వచ్చిన తొలి పెంతెకోస్తు దినాన పరిశుద్ధాత్మ, ఆయన అపొస్తలుల మీదికి దిగి వచ్చినట్టు, నేడుకూడా ఆయాస్థలాల్లో, ఆయా జనులమీద పరిశుద్ధాత్మ దిగి వస్తాడనే నమ్మకం కొందరిలో వుంది. అంటే, వారి ఆలోచన ప్రకారం, యిరికను జనులు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందుతారట. అలాంటి నమ్మకాలకు దైవ కార్యాలను దైవ నియమంలో ఎరుగలేకపోవడమే కారణం. గనుక పరిశుద్ధాత్మ బాప్తిస్మాన్ని గురించి దైవ లేఖనములు ఏమి బోధిస్తున్నాయో పరిశీలించి చూద్దాం.

"పరిశుద్ధాత్మ బాప్తిస్మము" అనే అంశాన్ని బాప్తిస్మమిచ్చిన యోహానే తొలిగా ప్రస్తావించినట్టున్నాడు. అతడు తనకున్నూ,

ప్రభువైన క్రీస్తుకునూ గల వ్యత్యాసాలను సూచిస్తూ - "మీరు మనస్సు నిమిత్తము నేను నీళ్ళలో బాప్తిస్మ మిచ్చుచున్నాను; అయితే నా వెనుక వచ్చుచున్న వాడు నాకంటె శక్తిమంతుడు; ఆయన చెప్పులు మోయుటకైనను నేను పాత్రుడను కాను; ఆయన పరిశుద్ధాత్మతోను అగ్నితోను మీకు బాప్తిస్మ మిచ్చును..." అని తెలిపాడు (మత్తయి 3:11).

## ఎవరు ఇస్తారు?

అగ్ని బాప్తిస్మం సంగతి ప్రస్తుతానికి వదలివేద్దాం. పరిశుద్ధాత్మ బాప్తిస్మం గురించే ఆలోచన చేద్దాం. పరిశుద్ధాత్మ బాప్తిస్మ మిచ్చే వారు ప్రభువైన యేసు అని తేలిపోయింది. ఆ బాప్తిస్మం ఆయన ఎవరికి యిస్తాడో ఆయనే చెప్పాలి! ఆయన ఎవరికంటే వారికి ఆ బాప్తిస్మం యివ్వనట్టున్నారు. అయితే ఆయన ప్రసంగంలో పరిశుద్ధాత్మను పొందే వారిని గూర్చి సూచనగా చెప్పినట్టున్నారు. పరిశుద్ధాత్మను పొందటానికి ఆయన యందు విశ్వాసం అవసరమై యుంటుంది (యోహాను 7 : 37-38). అయినా కేవలం విశ్వాసమే చాలునా? అనేది మెల్లగా చూద్దాం.

## ఎవరు పొందుతారు?

పరిశుద్ధాత్మ బాప్తిస్మం పొందే దెవరో? క్రీస్తు ప్రభువు తాను అప్పగింపబడ బోవు రాత్రి తన అపొస్తలులతో మాట్లాడుతూ, ప్రభువు వేడిన దానిని బట్టి తండ్రియైన దేవుడు అపొస్తలులమీదికి పరిశుద్ధాత్మను పంపునని చెప్పిన తరువాత, లోకము ఆయనను ఎరుగదు గనుక ఆయనను పొందనేరదనీ, అపొస్తలులు ఆయనను ఎరుగుదురు, ఆయనను పొందుదురనీ సూచించారు (యోహాను 14:16, 17).

"తండ్రియొద్ద నుండి మీ యొద్దకు నేను పంపబోవు ఆదరణ కర్త, అనగా తండ్రి యొద్దనుండి బయలుదేరు సత్యస్వరూపియైన

ఆత్మ వచ్చినప్పుడు ఆయన నన్ను గూర్చి సాక్ష్యమిచ్చును..." (యోహాను 15 : 26). ఈ సమయంలో ప్రభువు తన అపొస్తలులకు తెలియ చేసింది, యోవేలు గ్రంథంలో ఆత్మను గూర్చి తండ్రి చేసిన వాగ్దానమేనట! అయినా ఈ సంగతిని ప్రభువు నోటనే విందాం. మనం ఊహించుకోవలసిన అవసరంలేదు. ఆయన మృతుడై తిరిగి బ్రతికిన తరువాత కూడా పరిశుద్ధాత్మను గూర్చిన సంగతిని ఆయన ప్రస్తావించకుండ మానలేదు. ఆయన వారి మీద ఊది – "పరిశుద్ధాత్మను పొందుడి" అని తెలిపారు (యోహాను 20:19-22). ఇప్పటివరకు— పరిశుద్ధాత్మ మీయొద్దకు వస్తాడు; పరిశుద్ధాత్మను పొందండి, ఆయన వచ్చి అలా చేస్తాడు, యిలా చేస్తాడని ప్రభువు తన అపొస్తలులతో అంటున్నారు కాని వారు పరిశుద్ధాత్మ బాప్తిస్మపు కొలతలో పొందుతారని ఆయన అనలేదు. అయితే బాప్తిస్మము కొలతలో పరిశుద్ధాత్మ ఎవరి మీదికి వస్తారో!

"ఆయన శ్రమపడిన తరువాత నలుబది దినములవరకు వారి కగపడుచు, దేవుని రాజ్య విషయములను గూర్చి బోధించుచు, అనేక ప్రమాణములను చూపి—వారికి తన్ను తాను సజీవునిగా కనుపరచు కొనెను. ఆయన వారిని (అపొస్తలులను) కలసికొని యీలాగు ఆజ్ఞాపించెను—మీరు యెరూషలేమునుండి వెళ్లక నావలన వినిన తండ్రి వాగ్దానము కొరకు కనిపెట్టుడి" (అపొ. 1 : 3-4).

గమనించు ఇంతకు ముందుగా మనం అనుకున్నది నీకు జ్ఞాపకం వుందా ? ఆరాత్రి భోజనం దగ్గర ప్రభువు తన అపొస్తలులకు తెలిపిన సంగతిని ఆయన యిక్కడ ప్రస్తావించి మాట్లాడారు. పరిశుద్ధాత్మను గూర్చి వారికి ఆయన తెలిపినది తండ్రి వాగ్దానమేనట! వారు (అపొస్తలులు) యెరూషలేమునుండి వెళ్ళక ఆయన వలన (ఆరాత్రి) విన్న తండ్రి వాగ్దానం కొరకు వారు కనిపెట్టాలట!

బాప్తిస్మమిచ్చు యోహాను, తన పరిచర్యలో ప్రభువును తన శ్రోతలకు పరిచయం చేసినప్పుడు - నేను నీళ్ళలో బాప్తిస్మ మిస్తున్నాను కాని క్రీస్తు పరిశుద్ధాత్మలో...బాప్తిస్మమిచ్చునని చెప్పాడు. అయితే ప్రభువు ఈ సందర్భంలో బాప్తిస్మ మిచ్చు యోహాను పరిచర్యను జ్ఞాపకం చేస్తూ—"యోహాను నీళ్ళతో బాప్తిస్మము ఇచ్చెను గాని, కొద్ది దినములలోగా మీరు (అపొస్తలులు) పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందుదురనెను" (అపొ. 1:5). గనుక పరిశుద్ధాత్మ బాప్తిస్మము యిచ్చేది ప్రభువు, పొందేది ఆయన అపొస్తలులుమాత్రమే!

## ఏమి జరుగును

కాబట్టి వారు కూడి వచ్చినప్పుడు - ప్రభువా, యీ కాలమందు ఇశ్రాయేలునకు రాజ్యమును మరల అనుగ్రహించెదవా ? అని ఆయనను అడుగగా, ఆయన - కాలములను సమయములను తండ్రి తన స్వాధీనమందుంచుకొని యున్నాడు; వాటిని తెలిసికొనుట మీ పని కాదు. అయినను పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తి నొందెదరు గనుక మీరు యెరూషలేములోను, యూదయ సమరయ దేశముల యందంతటను భూదిగంతముల వరకు, నాకు సాక్షులై యుందురని వారితో చెప్పెను. ఈ మాటలు చెప్పి వారు చూచుచుండగా ఆయన ఆరోహణమాయెను" (అపొ, కా. 1:6-9).
ఆ సంభవం జరిగింది ఒలీవల కొండమీద.

అంతట వారు యెరూషలేమునకు తిరిగి వచ్చి, తమతో కూడ ఉన్నవారిలో ఒకని - ఇస్కరియోతు యూదాకు బదులు ఏర్పరచుకొని, ప్రభువు వలన వినిన తండ్రి వాగ్దానం కొరకు కనిపెడుతూ వున్నారు. అప్పటికి 10 రోజుల లోపే పెంతెకొస్తు అను యూదుల పండుగ దినం వస్తుంది. ఆ రోజున అపొస్తలులు పరిశుద్ధాత్మతో బాప్తిస్మం పొందారు.

"పెంతెకొస్తను పండుగ దినము వచ్చినప్పుడు అందరు ఒక చోట కూడి యుండిరి. అప్పుడు వేగముగా వీచు బలమైన గాలివంటి యొక ధ్వని ఆకాశమునుండి అకస్మాత్తుగా, వారు కూడియున్న యిల్లంతయు నిండెను. మరియు అగ్నిజ్వాలల వంటి నాలుకలు విభాగింపబడినట్టుగా వారికి కనబడి, వారిలో ఒక్కొక్కని మీద వ్రాలగ అందరు పరిశుద్ధాత్మతో నిండినవారై ఆ ఆత్మ వారికి వాక్శక్తి అనుగ్రహించిన కొలది అన్యభాషలతో మాటలాడ సాగిరి" (అపొ. 2 : 1-4).

అపొస్తలులు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందినప్పుడు, గొప్ప సాక్షి సమూహం వారి చుట్టు పోగైరి. "ఆ కాలమందు ఆకాశము క్రింద నుండు ప్రతి జనములోనుండి వచ్చిన భక్తిగల యూదులు యెరూషలేములో కాపురముండిరి. ఆ శబ్దము కలుగగా జనులు గుంపులుగా కూడివచ్చి, ప్రతి మనుష్యుడు తనతన స్వభాషతో వాళ్ళు (అపొస్తలులు) మాట్లాడుట విని కలవరపడిరి. అంతట అందరు విభ్రాంతి నొంది ఆశ్చర్యపడి - ఇదిగో మాటలాడుచున్న వీరందరు గలిలయులు కారా? మనలో ప్రతివాడును తాను పుట్టిన దేశపు భాషలో వీరు మాట్లాడుట మనము వినుచున్నామే; ఇదేమి?" అని అన్నారు (అపొ. 2: 5-8).

ఆ సమయంలో అపొస్తలులు ఏ భాషలో మాట్లాడారో చెప్పలేం. అయితే ఏ దేశంనుండి వచ్చినవాడికి ఆ దేశపు భాషలోనే అర్థమయ్యిందంటే - పరిశుద్ధాత్మయే, భాషలు మాట్లాడడానికి శక్తినిస్తూ, ఆయనే వారి శ్రోతలకు అర్థం చెప్పాడంటారేమో! అది ఎలా జరిగినా, విన్నవారు కలవరపడ్డారు; విభ్రాంతి నొందారు; ఆశ్చర్యపడ్డారు. ఏ పరిస్థితుల్లోనైనా అపహాసకులు వుంటారంటే వింత లేదు. గనుక పరిస్థితులు అంత ఆశ్చర్యంగావున్నా, అపహసించే - కొంద

నైతే- వీరు క్రొత్త మద్యముతో నిండియున్నారని అపహాసించారు. అప్పుడు పేతురు ఆ పదనొకండుగురుతో కూడ లేచి నిలిచి వారితో యిలా అన్నాడు:

"యూదయ మనుష్యులారా, యెరూషలేములో కాపురమున్న సమస్త జనులారా, యిది మీకు తెలియుగాక, చెవియొగ్గి నా మాట వినుడి; మీరు ఊహించినట్టు వీరు మత్తులు కారు; ప్రొద్దుబొడిచి జామైనను కాలేదు. యోవేలు ప్రవక్త ద్వారా చెప్పబడిన సంగతి యిదే" (అపొ. 2 : 14-15).

## ప్రవచన నెరవేర్పు

పరిశుద్ధాత్మ పూర్ణుడైన పేతురు ఏమంటున్నాడో గమనించు; ప్రవక్తయైన యోవేలు 2:28-32 లో ఆత్మను గూర్చి చేయబడిన వాగ్దాన మదేనట!! ప్రవచించుటకు ఆనాడు యోవేలును ప్రేరేపించిన వాడే, పెంతెకొస్తు దినమున పేతురును ప్రేరేపించి, యోవేలుద్వారా పలుకబడిన సంగతి యిదేనని - యోవేలు 2:28-32 ను కోట్ చేస్తూ వక్కాణించుతూ వుంటే, "పెంతెకొస్తు దినమున జరిగింది యోవేలు ప్రవచనం యొక్క నెరవేర్పు కాదు". అనేవాడిని యిక ఏమనాలో! యోవేలు 2 : 28-32 ను చదివి, మాట మాటకు అర్థం, నెరవేర్పు వగైరాలను దీనికి వేరుగా వెదుక ప్రయత్నించేవారికి (Hermunitics) వ్యాఖ్యాన శాస్త్రం తెలియదనే చెప్పాలి. అంతేగాని లేఖనాల నెరవేర్పులో సమస్య లేదు.

ఆ పెంతెకొస్తు దినం నుండి, ప్రభువు ముందుగా తెలియజేసినట్లే-అపొస్తలులతోను, అపొస్తలులద్వారాను పరిశుద్ధాత్మ తన కార్యక్రమాలను కొనసాగింప మొదలు పెట్టాడు. అపొస్తలుల ద్వారానే, అంటే దైవ నియమానికి అనుకూలమైనవారి కార్యముల ద్వారాను, వారి బోధ ద్వారా పరిశుద్ధాత్మ సకల శరీరులకు లభ్యమా

తాడు. తరువాత అంశాల్లో వీటిని సవిస్తరంగా చర్చించుకుంటాం. గనుక యిప్పటికి దీనిని వదలి పెంతెకొస్తు దినాన పేతురు ప్రసంగానికి తిరిగి వద్దాం. యూదులు అతని బోధ వింటున్నారు.

గనుక అతడు వారితో మాట్లాడుతూ, ప్రభువైన యేసు యొక్క మరణం సమాధి పునరుత్థానాలను గూర్చి లేఖనాలెత్తి చూపి-"మీరు సిలువ వేసిన యేసును" దేవుడు లేపాడు. దీనికి మేమందరం సాక్షులం. "కాగా ఆయన దేవుని కుడిపార్శ్వమునకు హెచ్చింపబడి, పరిశుద్ధాత్మను గూర్చిన వాగ్దానమును తండ్రివలన పొంది, మీరు చూచుచు వినుచున్న దీనిని కుమ్మరించియున్నాడు" (అపో. 2:32-33) అని వివరించాడు. గనుక ప్రవక్తయైన యోవేలు ద్వారా తండ్రి చేసిన వాగ్దానాన్ని ప్రభువు పొంది, ఆయన తన అపొస్తలులకు బాప్తిస్మముగా ఆ పెంతెకొస్తు దినాన యిచ్చారు.

—G. దేవదానం, మద్రాసు-12.

—o—

## ద్వేషమును గూర్చి జాగ్రత్త !

## (Beware of Bitterness)

అపో. పౌలు ఇట్లు వ్రాయుచున్నాడు: "సమస్తమైన ద్వేషము, కోపము, క్రోధము, అల్లరి, దూషణ, సకలమైన దుష్టత్వము మీ నుండి విసర్జించుడి" (ఎఫెసీ 4 : 31).

మీరు ఏదైనా జైలును సందర్శించి దానిలో శిక్ష ననుభవించుచున్న నేరస్థులతో మాట్లాడి చూడుడి. వారి మనస్సులో యున్న ద్వేషాన్నంతా కక్కేస్తారు. తమ స్వలాభం కొరకు, స్వార్థం కొరకు

పనిచేయుచున్న వారితో సంభాషించండి. నోరు విప్పితే చాలు వారెవరిమీదనో పడ్చుకొంటారు. ఈ దురభిమాన ద్వేషం ఈ మధ్య బోధకులలో ఎక్కువ కన్పడు చున్నది. వారు చేసే బోధలు, వ్రాసే వ్రాతలు ఎప్పుడు ఎవరిమీదనో పరోక్షంగా ద్వేషాన్ని వెళ్ళ గ్రక్కుచూ యుంటాయి. సిద్ధాంతపరంగా భేధములు లేకపోయినా తమ ప్రాతినిధ్యానికి గండం పడేలాగున్నదనే దురభిమానంతో ఈ మధ్య కొందరు తమ దేషాన్ని ఆయా వ్యక్తులమీద వెళ్ళగ్రక్కు చున్నారు. క్రీస్తు సంఘములో ఇట్టిది తగదు. ఒకే శరీరములోని అవయవాలు పరస్పరం కీచులాడుకోవు గదా. 1 కొరింథీ 12:14 నుండి 27 వరకు దయచేసి చదువండి. క్రీస్తు శరీరములో లేని వివాదములను కల్పించ బూనుకొనుట మానుకొనండి.

మన విశ్వాసము, నిరీక్షణ క్రీస్తునందున్నది. మన నిరీక్షణ తాత్కాలిక, భౌతిక విజయంపై గాక కీడుపై మేలు సాధించే నిత్య విజయంపై యున్నది; దుష్టత్వము దుర్నీతిపై నీతి న్యాయములు సాధించే విజయంపై యున్నది. ద్వేషముతోను, కోపముతోను, దూషణ దుష్టత్వముతోను మన హృదయాలను నింపి నాశనం చేయూలని సాతాను చూచుచున్నాడు. వాక్యాన్ని ఎరిగినవారమైతే "సాతాను తంత్రములను మనము ఎరుగనివారము కాము" (2 కొరింథీ 2:11). అసూయ ద్వేషములతో మన హృదయం నిండియున్నప్పుడు క్రీస్తు కొరకు యేమీ సాధించలేమని అపవాది ఎరుగును. కుళ్లుపట్టిన ఆత్మతో సహోదరులమీద సణుగుచు గొణుగుచు విజయాన్ని సాధించలేము.

గనుక దురభిమాన ద్వేషాన్ని గూర్చి జాగ్రత్త! అది నిన్ను మింగివేస్తాది. నిరుత్సాహానికి నిస్పృహకు దారి తీస్తాది, నీ నిత్య జీవిత నిరీక్షణను హరించివేస్తాది. క్రీస్తువైపు చూడు. ఆయన నిన్ను

క్షమించిన ప్రకారం నీవును యితరులను క్షమించుటకు నేర్చుకో. "నా పొరుగువానికంటే నేను పరిశుద్ధుడను" అనే తత్వం విసర్జించు. క్రీస్తు కృపను బట్టి పనిచేయి.

—జాషువా గూటం.

---

## లోకమునకు వెలుగు

## ( Light of the World )

"మీరు లోకమునకు వెలుగై యున్నారు; కొండమీద నుండు పట్టణము మరుగై యుండనేరదు. మనుష్యులు దీపము వెలిగించి కుంచముక్రింద పెట్టరు గాని అది యింటనుండు వారందరికి వెలుగిచ్చుటకై దీప స్థంభము మీదనే పెట్టుదురు" అని యేసు ప్రభువు బోధించారు (మత్త 5 : 14, 15).

మీరు లోకమునకు వెలుగై యున్నారని క్రీస్తు తన శిష్యులతో చెప్పిన మాటలు మనకును వర్తిస్తాయి. మనము లోకమునకు వెలుగై యున్నాము! మనం క్రీస్తు మాదిరి ననుసరించి జీవించినా, సాతాను మాదిరి ననుసరించి జీవించినా మన జీవితాలను అసంఖ్యాకులు పరిశీలించుచున్నారు. ఎవరికీ కనబడకుండా మానవుడు నూతిలో కప్పలాగ జీవించలేడు. మరి ముఖ్యముగా క్రైస్తవుడు తన ప్రవర్తనను, క్రియలను కప్పిపుచ్చలేడు.

"నీ క్రియలు చేసే శబ్దాన్ని బట్టి నీవు చెప్పేది నాకు వినబడటం లేదు" (**What you are, speaks so loud, I cannot hear what you say**) అని ఎమర్సన్ అనే ఒక ప్రఖ్యాత వక్త చెప్పాడు. ఒకడు ప్రతి దినము వేలకొలది ప్రజల మధ్య నిలబడి క్రీస్తు సువార్తను బోధించవచ్చు, అయితే తాను చేసే బోధకు మాదిరిగా తన

జీవితం ఉండకపోతే అతడు చేసే మేలు శూన్యం. ఒకడు పాపంలో జీవిస్తూ, మంచిని బోధించి సత్ఫలితాలను ఆశించలేడు. అందుకే బోధకుడు మాటలోను, ప్రవర్తనలోను, ప్రేమలోను, విశ్వాసములోను, పవిత్రతలోను విశ్వాసులకు మాదిరిగా యుండాలి (1 తిమో 4 : 12).

యేసుక్రీస్తు యొక్క పరిపూర్ణ జీవితాన్ని గూర్చి బోధించుటకు దేవుడు మనకు శక్తిని సామర్థ్యాన్ని జ్ఞానాన్ని ఇచ్చుట మాత్రమే గాక, ఆ పవిత్రమూర్తి ననుసరించు జీవితాన్ని జీవించుటకు సహాయం చేయునుగాక!

—డాల్టన్ క్రీ.

---

## "ఒక మనుష్యుడు లోకమంతయు సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టుకొంటే అతని కేమి ప్రయోజనము ?" మత్త 16 : 26

**("What will it profit a man if he gains the whole world, but loses his soul?")**

క్రీస్తు ప్రభువు తన శిష్యులతో చెప్పిన గొప్ప హెచ్చరికతో కూడిన వచన భాగమిది. తెలుగు బైబిల్లో "ప్రాణము" అని తర్జుమా చేయబడుటవలన ఈ వచనముయొక్క భావానికి సంపూర్ణ స్వరూపము ఏర్పడలేదు. ఒక మనుష్యుడు లోకమంతయు సంపాదించుకొని తన ఆత్మను పోగొట్టుకొంటే అతని కేమి ప్రయోజనము ? మనం గమనించదగిన ముఖ్యవిషయమేమంటే ప్రాణము (Life) లేక ఆత్మ (soul) అని అర్థము వచ్చే గ్రీకు మూలపదంనుండి తర్జుమా చేయబడుటవలన తర్జుమాదారుల దోషంకూడ ఇందు కనిపించదు.

లోకమంతటికంటె దేవుడు నీకిచ్చియున్న ఆత్మ విలువైనది. ఆత్మ యొక్క ఔన్నత్యాన్ని తెలియజేస్తూ ప్రభువు సెలవిచ్చెను: "ఆత్మను చంపనేరక దేహమునే చంపుచువారికి భయపడకుడి గాని, ఆత్మను దేహమును కూడ నరకములో నశింపజేయగల వానికి మిక్కిలి భయపడుడి" (మత్త 10:28). ఆత్మ రక్షణయొక్క ప్రాముఖ్యమును పై వచనము విశదీకరించుచున్నది.

లోకమంతయు సంపాదించిన మానవులు రిక్త హస్తాలతో తిరిగి వెళ్ళడం మనం గమనించే నగ్న సత్యం. రాజ్యకాంక్ష గల నియంతలు తమ అధికార దాహానికి అనేకులను హతమార్చిన వీరు తరుమబడి దిక్కులేని స్థితిలో మరణించడం చరిత్ర పుటలు నేర్పిన సత్యాలు. ఒక నియంత మృత దేహాన్ని ఆయన దంతవైద్యుడు తప్ప మరెవరూ గుర్తించలేని విధంగా మరణించాడు. లోకమునంతయు సంపాదించుకొని నిరీక్షణ లేక భయంతో చనిపోవుటకంటె ఆత్మను రక్షించుకొని నిత్యజీవము పొందుట శ్రేష్టమని ఈ వచన భాగముయొక్క సారాంశము.

"సర్వ శరీరులు గడ్డిని పోలినవారు, వారి అందమంతయు గడ్డి పువ్వువలె ఉన్నది: గడ్డి ఎండును దాని పువ్వును రాలును" 1 పేతు 1 : 24. అయినప్పటికిని మానవులు లోకాన్ని శాశ్వతంగా భావించి అతిశయించుచున్నారు.

లోకమునంతయు సంపాదించుకొనే ప్రయత్నంలో మారణాయుధాలను తయారుచేసి ఒకరిపై ఒకరు ప్రయోగించుకొని ఆనందించుచున్నారు. ఒక క్షిపణిలో ఉపయోగించే బ్యాటరీ ఎన్ని కోట్ల డాలర్లు వెచ్చించి తయారుచేయూలో లేక ఒక యుద్ధ విమానం యొక్క వెల అడిగి తెలుసుకొంటే భయం కలుగుతుంది. ఒక క్షిప

ణిని మార్గ మధ్యంలోనే పేల్చి వేయగల శక్తి పణిని తయారు చేసే ఆధునిక శాస్త్ర పరిజ్ఞానం, నేడు మానవునికి ఉన్నదని ఇటీవల జరిగిన యుద్ధంలో ప్రత్యక్షంగా చూసాం.

ఆత్మల రక్షణ నిమిత్తము ప్రభువు ఈ లోకానికి వచ్చి గొప్ప రక్షణా సంకల్పన్ని మానవుల ముందుంచెను. ఈ సంకల్పంవైపు మానవులు తమ దృష్టిని కేంద్రీకరించకుండ లోకమువైపు, సంపాదన వైపు తమ దృష్టిని ఉంచారు.

మరికొందరు ఆత్మరక్షణ పేరుతో మోసగింపబడుచున్నారు. కొందరు మతశాఖలవారు తమ ప్రసంగాలను వ్యాసాలను ముగించే విధానము ఆశ్చర్యం కలిగిస్తుంది. "నీవు ఈనాడే క్రీస్తును నీ రక్షకునిగ అంగీకరించుము" "నీవు దేవుని విశ్వసించుము" "నీవు దేవుని ప్రార్థించుము". "నీవు ప్రభువును నీ హృదయములోనికి చేర్చుకొనుము" నీవు రక్షింపబడుదువు అని బోధించుచున్నారు. ఇందు ఉత్తమమును, అనుకూలమును, సంపూర్ణమునై యున్న దేవుని చిత్తము కనిపించదు. రక్షింపబడుటకు ఒకడు లోబడవలసిన ఆజ్ఞలను చక్కగా విశదీకరించి తెలియజేయుట లేదు.

ఆత్మను పోగొట్టుకొంటే అతనికేమి ప్రయోజనము ? దేవునికి ఆయన రక్షణా సంకల్పానికి విధేయుల మగుట ద్వారా మన ఆత్మను మనము కాపాడుకొనగలము. దేవుని రక్షణా సంకల్పము లేఖనములయందు తేలికైన భాషలో స్పష్టంగా వ్రాయబడినది. "మీ విశ్వాసము మనుష్యుల జ్ఞానమును ఆధారము చేసికొనక దేవుని శక్తిని ఆధారము చేసికొని యుండవలెనని, నేను మాటలాడినను సువార్త ప్రకటించినను, జ్ఞానయుక్తమైన తియ్యని మాటలను వినియోగింపక, పరిశుద్ధాత్మయు దేవుని శక్తియు కనుపరచు దృష్టాంతములనే ఉపయోగించితిని". పౌలు సువార్తను ప్రకటించునప్పుడు

అతడు తీసుకొనిన జాగ్రత్తను ఈవచనమునందు వ్యక్తము చేసెను. (1 కొరింథీ 2 : 4-5).

క్రీస్తు సంఘస్థులు వాక్యమును బోధించునప్పుడు వాక్యాధారము చూపకుండ ఏ మాట వారు చెప్పరు. దీనికి కారణము వాక్యము యొక్క అధికారానికి వారు పూర్తిగా లోబడినవారు.

మీరు మీ ఆత్మను పోగొట్టుకొన కూడదనే ఆశతో మేము ఈ సువార్తను మీకు ప్రకటించుచున్నాము. మీ ఆత్మల యెడల మేము ఆసక్తిని కలిగియున్నాము. ఎందుకనగా మేము దేవుని చిత్తమునకు లోబడినవారము. దేవుని రక్షణా సంకల్పమును శ్రద్ధతో చదవండి.

1. "వినుటవలన విశ్వాసము కలుగును. వినుట క్రీస్తును గూర్చిన మాట వలన కలుగును" రోమా 10 : 17.
2. "ప్రభువైన యేసునందు విశ్వాసముంచుము" అ. కా. 16 : 31
3. "మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరును ఆలాగే నశింతురు" లూకా 13 : 3.
4. "మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును వాని ఒప్పుకొందును". క్రీస్తు ప్రభువని ఒప్పుకొనుము. మత్త 10 : 32.
5. బాప్తిస్మము పొందుము. అ. కా. 22 : 16.
6. మరణము వరకు నమ్మకమైన క్రైస్తవునిగ జీవించుము. ప్రక 2 : 10.

లోకమును కాదు ఈనాడే ఆత్మరక్షణను పై ఆజ్ఞలకు విధేయుడవగుట ద్వారా సంపాదించుకొనుము.

— E. K. V. ప్రసాదరావు, చెయ్యేరు.

# కాకి తాళీయం

లోక రక్షకుడైన క్రీస్తుయేసు
కాకుల సంగతి మరీ చెప్పాడు
ఆకలి వస్త్రాలకై ఆలోచింపక (లూకా. 12 : 22-24)
లోకంలో క్రైస్తవులైనవారు
– ఆత్మీయ రాజ్యం, నీతిని అన్వేషించాలని !
ఓడలోంచి నోవా వదలిన కాకి
ఏ కాకిగా ఎగిరెళ్ళి మళ్ళీ రాలేదు (ఆది. 8 : 6-7)
మారుమనస్సుకు మరో ఛాన్స్ లేని
అవిధేయులకు అవిశ్వాసులకు (హెబ్రీ 6:4-6)
సూచనగా చరిత్రలో నిలిచింది !

క్షామకాలంలో క్షేమమిస్తానన్న
దైవానికి లోబడిన కాకోలములు
"రొట్టె-మాంసం" ఏలీయాకందించి (1 రాజు 17:4-6)
విధేయత విశ్వాసం ప్రదర్శించి
విశ్వాసుల పక్షంగా నిలిచాయి !

తిండిలేక తిరుగాడే కాకిపిల్లలు
తండ్రికే మొఱపెడుతుండగా (యోబు 38:41, కీర్తన 147:9)
దండిగా తిండి దొరికినవాళ్లు
మెండుగా దేవుని స్తుతింపక—
కొండెగాండ్రయి (రోమా 2 : 20-24)
కావ్ ! కావ్ ! మనుట క్రైస్తవ్యమా ?

— యస్. జె. మేడిద. కొణితివాడ.

## క్రీస్తునందు నిద్రించినవారు ధన్యులు

దేవుని రాజ్యాంగమైన క్రొత్త నిబంధనలో, 7 ప్రత్యేకమైన ధన్యతలు కలవు. కాలమును బట్టి మొదటిగా వ్రాసిన థెస్సలోనీక పత్రిక, ధన్యతతో ప్రారంభమై (1 థెస్స 4 : 13-16), ఆఖరిగా ప్రకటనలో ధన్యతతోనే ముగించబడెను (ప్రకటన 22:14). క్రొత్త నిబంధన 27 పుస్తకముల అమరికలో మొదట కూర్చబడిన మత్తయి సువార్తలో ప్రభువు కొండమీద ప్రసంగములో "ఆత్మ విషయమై దీనులైనవారు ధన్యులు, పరలోక రాజ్యం వారిదని ప్రారంభించెను". అందుచే ధన్యత అనే పదము గ్రంథంలో ప్రాముఖ్యముగా దాఖలు చేయబడెను. 7 ధన్యతలలో "క్రీస్తు నందు నిద్రించిన ధన్యుల" యొక్క జీవితపు వాస్తవాలను చూద్దాము. ధన్యులు అనగా భాగ్యవంతులు లేక సంతోషభరితులని భావం. ఇట్టి ధన్యకరమైన స్థితి ప్రభువునందున్న వారికి మాత్రమే చెందుతుంది (ప్రకటన 14 :13; గలతీ 2 : 20).

## పిలువబడిన వారు ధన్యులు

లోక మంతయు దుష్టుని యందున్నది (1 యోహాను 5 : 19). అందులో శరీరాశ నేత్రాశ జీవపు డంబము తప్ప మరేమియు లేదు (1 యోహాను 2 : 20). ఈ లోక జ్ఞానమును దేవుడు వెఱ్ఱితనముగ జేసెను. లోకము తన జ్ఞానముచే దేవున్ని ఎరుగకుండి నందున, సువార్త ప్రకటన యను వెఱ్ఱితనము చేత నమ్మువారిని రక్షించుటకు దేవుని దయాపూర్వక సంకల్ప మాయెను (1 కొరింధీ 1 : 20-21). పాపపు దాస్యము నుండి విమోచన కొరకు ఆశ్చర్యకరమైన వెలుగునకు సువార్త ద్వారా పిలువబడిన వారు ధన్యులు (II థెస్స 2:14; 1 పేతురు 2:9). ఈ సువార్త పిలుపు లేకపోతే మానవాళికి సమాధే

అంతం. కాబట్టి పిలువబడి ప్రభువునందు నిద్రించినవారు ధన్యులై యున్నారు.

## పునరుత్థానంలో పాల్గొన్న వారు

క్రీస్తు యేసు సంబంధులు శరీరమును దాని యిచ్ఛలతోను దురాశలతోను సిలువ వేసియున్నారు (గలతీ 5:24). ఎట్లనగా యేసు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మం పొందితిమని మన మెరుగుదుము. కాబట్టి తండ్రి మహిమ వలన యేసు మృతులలో నుండి ఏలాగు లేపబడెనో ఆలాగే మనమును నూతన జీవము పొందినవారమై నడచుకొనునట్లు మనము బాప్తిస్మం వలన మరణములో పాలు పొందుటకై ఆయనతో కూడా పాతిపెట్ట బడితిమి (రోమా 6 : 3-4). ఈ మాట నమ్మదగినది. ఏదనగా మనము ఆయనతో కూడా చనిపోయిన వారమైతే ఆయనతో కూడా బ్రతుకుదుము (II తిమోతి 2 : 11). కాబట్టి ఆయన మరణ పునరుత్థానముల సాదృశ్యమందు ఐక్యము గలవారు ధన్యులు (రోమా 6 : 5).

## నిరీక్షణ గలవారు ధన్యులు

భక్తి హీనులకు వారి జీవితంలో చెప్పుకో తగిన గమ్యం లేదు. విశ్వాస మనునది నిరీక్షింపబడు వాటియొక్క నిజస్వరూపమై యున్నది (హెబ్రీ 11:1). నిరీక్షింపబడునది కనబడినప్పుడు నిరీక్షణతో పని యుండదు (రోమా 8:24). నా తండ్రి యింట అనేక నివాసములు కలవని ప్రభువు చెప్పెను (యోహాను 14:1-4). ఆ నిత్య నివాసములు ధన్యజీవుల కొరకే. కాబట్టి మన పౌర స్థితి పరలోక మందున్నది (ఫిలిప్పీ 3 : 19).

కాబట్టి నిద్రించుచున్న వారిని గూర్చి దుఃఖించక లేఖనముల యందున్న ధన్యకరమైన స్థితిని గ్రహించాలి. 2వ రాకడలో క్రీస్తు నందు నిద్రించినవారే మొదట లేతురు. ఆ మీదట సజీవులైనవారు అక్షయ దేహంతో ఆకాశమందు మేఘములమీద కొనిపోబడి సదా కాలము ప్రభువుతో కూడా యుందురు (1 థెస్స 4 : 13-17). ఆయన యున్నట్లుగానే చూచెదము ఆయనను పోలియుందుము (1 యోహాను 3 : 2-3). దేవుని కుమారుల ప్రత్యక్షత కొరకు సృష్టి మిగుల ఆశతో తేరి చూచుచు, కనిపెట్టుచున్నది (రోమా 8 : 19). అందుచే రెండవ రాకడ కొరకు కనిపెట్టుచు దానిని ఆశతో అపేక్షించాలి (II పేతురు 3 : 12).

## భౌతిక మరణం అవసరమే

ఎందుకంటే రక్త మాంసములు దేవుని రాజ్యాన్ని స్వతంత్రించుకొనుట అసాధ్యం (1 కొరింథీ 15:50-51). దేహాన్ని విడచితినే దేవుని యొద్దకు వెళ్లుటకు అవకాశముంది (ప్రసంగి 12 : 7). నేను వెడలిపోయి క్రీస్తుతో కూడా ఉండాలని కోరి, నామట్టుకైతే బ్రతుకుట క్రీస్తే చావైతే లాభం అని పౌలు చెప్పెను (ఫిలిప్పీ 1:21-22). భౌతిక మరణము క్రీస్తు నుండి వేరుచేయదు. క్రీస్తు ప్రేమనుండి మనలను ఎడబాపు వాడెవడు ? (రోమా 8 : 35). దేహంలో ఉన్నంత కాలం శ్రమలు బాధలు దుఃఖం ఏడ్పు వెంబడిస్తూనే ఉంటుంది. గనుక భౌతిక మరణం అవసరమే! భూనివాసకాలం నీడ అంత అస్థిరం. స్థిరముగానున్న వారెవరును లేరు (1 దినవృ.29:15). కాబట్టి ఇప్పటినుండి ప్రభువునందు మృతి పొందు మృతులు ధన్యజీవులై యున్నారు (ప్రకటన 14 : 13). వీరిమీద రెండవ మరణమునకు అధికారం లేదు.

G. ప్రకాశర, పెరంబూరు, మద్రాసు-12.

## నశించిన వానిని వెదకి రక్షించుటకు క్రీస్తు వచ్చెను

శరీరమును బట్టి క్రీస్తు యూదులలో పుట్టెను. యూదులు తమ మతములో బహు నిష్టపరులు. అన్యజాతి వారితో సాంగత్యము చేయుట, అట్టివారిని ముట్టుకొనుట యూదునికి ధర్మముకాదు. ఆలాగే వారిలోనుండి నిషేధించి అంటరాని వారిగా వేరు పరచిన తెగలున్నవి. వారిని సుంకరులు, పాపులు అని పిలుచుచు యూదులు వారిని అసహ్యించుకొనుచుందురు. మరియు అప్పటిలో సమరయులు అను మరొక తెగవారితో కూడా ఈ యూదులు సాంగత్యము చేయుటగాని వారి పాత్రలను తాకుటగాని కూడదని వారిని దూర పర్చియుండిరి.

ఇట్లు బాహ్యసంబంధమగు శరీర నియమములను నెరవేర్చుటలో బహు నిష్ట కనుపరచుచూ, ఈ యూదులు వారి పారంపర్యాచారములను గైకొనుటకు దేవుని ఆజ్ఞను బొత్తిగా నిరాకరించుచుండిరి. క్రీస్తు శరీరధారిగా యూదుడైయున్నను, యూదుల పారంపర్యాచారాలను తీవ్రంగా విమర్శించుచూ శాస్త్రుల పరిసయ్యుల యొక్క వేషధారణను బహిరంగంగా ఖండించేవాడు.

యూదులచే ద్వేషింపబడిన సమరయుల మధ్యకు క్రీస్తు వెళ్ళి వారి మధ్య నివసించి వారిని రక్షించుట, సుంకరులు, పాపులు అనబడినవారిని చేర్చుకొని వారితో కలసి భోజనము చేయుట, అన్యజనులను ఆదుకొని వారి అక్కర్లను తీర్చుటవంటి క్రియలతోను, ఉపదేశముతోను వారిని ఆదరించుట చూచుచున్న మతోన్మాదులైన శాస్త్రులు, పరిసయ్యులు సహించగలరా? (యోహా 4:9; 40-41, మత్త 9 : 10-11, లూకా 15 : 1-2, మత్త 15 : 21-28, లూకా 7 : 2, 9, 10.)

నశించిన దానిని వెదకి రక్షించుటకు నేను వచ్చితిని అని చెప్పుచు అందుకు ప్రతివారు సులువుగా దేవుని ప్రేమ అనుగ్రహించ గలుగునట్లు ఉపమాన రూపములో అనేక సంగతులను చెప్పెను. ఇందులో సృష్టికి కర్తయై సర్వశక్తిగల తండ్రియైన దేవునికి దీనులైన మానవుల పట్లగల అపారమైన ప్రేమ తేటబడుచున్నది. మరియు దేవుని వాక్యము ఈరీతిని బోధించుచున్నది :

## శరీరము నిష్ప్రయోజనము

"ఏ శరీరియు దేవుని యెదుట అతిశయింపకుండునట్లు జ్ఞానులను సిగ్గుపరచుటకు లోకములో నుండు వెర్రివారిని దేవుడు ఏర్పరచుకొని యున్నాడు. బలవంతులైన వారిని సిగ్గుపరచుటకు లోకములో బల హీనులైన వారిని దేవుడు ఏర్పరచుకొని యున్నాడు. ఎన్నికైన వారిని వ్యర్థము చేయుటకు లోకములో నీచులైనవారిని, తృణీకరింప బడినవారిని ఎన్నికలేని వారిని దేవుడు ఏర్పరచుకొనియున్నాడు" (1 కొరి 1 : 27-29). నీచులని నిషేధింపబడి, పాపులని పారద్రోలబడి అన్యులని అణగద్రొక్కబడినను వారందరు యేసు క్రీస్తునందు యూదులతోపాటు సమాన వారసులును, ఒకే శరీరమందలి సాటి అవయవములుగా జేసి, దేవుడు వారిని అంగీకరించియున్నాడు.

## కుల తత్వం కూడదు

భారతీయులలో అనేకులు క్రీస్తునందున్నామని క్రైస్తవులమని చెప్పుకొనుచున్నను, హిందుమత సాంప్రదాయమైన కుల వ్యవస్థ, కొందరిని పీడించుచునే ఉన్నది. వారు బైబిలును నమ్మినారు, బైబిలు చదువుతారు, బైబిలు బోధిస్తారు. సంఘములు, సంస్థలు స్థాపకులుగా వ్యాపకులుగా నాయకులుగా, సంస్థాధిపతులుగా బాధ్యతలు నిర్వ హిస్తారుగాని క్రైస్తవేతర సాంప్రదాయమైన కుల వ్యవస్థను మరువ

లేరు. తోటి సభ్యులైనా, సాటి సేవకులైనా ఏకులాన్నుండి వచ్చారు అనే వివరంకోరకు విచారించి అసలు సంగతి తెలిసాక తనవాడు కాకపోతే తన్ని తరిమే యత్నాన్ని ఆలోచించడం, తనవాడైతే తప్పు లెన్నున్న కప్పి వాటినుండి తప్పించి గొప్పచేయడం యివి తరచు వినబడే సంగతులు కనబడే సత్యాలు.

"ఏ మనుష్యుడును నిషేధింప దగినవాడనియైనను అపవిత్రుడని యైనను చెప్పకూడదని..." వ్రాయబడిన దేవోక్తి చేతిలోనే ఉంది. అందలి వాక్యాలు ఇంకను ఈలాగు బోధిస్తున్నవి. "ఎవడైనను నేను దేవుని ప్రేమించుచున్నానని చెప్పి, తన సహోదరుని ద్వేషించిన యెడల అతడు అబద్ధికుడగును. తాను చూచిన తన సహోదరుని ప్రేమిం పనివాడు తాను చూడని దేవుని ప్రేమింపలేడు" (1 యోహాను 4:20).

ఏమి ? నశించిన దానిని వెదకి రక్షించుటకు వచ్చిన క్రీస్తును వెంబడించిన నీవు కృశించిన వారిని నలుగ త్రొక్కుచూ వెళ్లెదవా ? మన నిమిత్తమై తన ప్రాణము పెట్టిన క్రీస్తులో జీవించుచున్నానని చెప్పు నీవు నీ సహోదరుని కొరకు ప్రాణము పెట్టబద్ధుడవై యుండగా నీ సహోదరుని ప్రాణాన్ని నిలువున తీసి నీ కులపిశాచికి బలి చేయుదువా ?

మన భారత దేశములో సుస్థిరముగా సాగిపోతున్న కులవ్యవస్థను వ్యక్తిగతంగా క్రీస్తు బోధను ఆధారం చేసికొని, నీవే నీలో నుండి కూకటి వేళ్లతో కూలద్రోయాలి. ఆ కుల రక్కసి బానిసత్వమునుండి సంపూర్ణ స్వాతంత్ర్యము పొందాలి, స్వార్థపరులు తమ స్వకీయ దురాశలకు అనుకూలంగా అసూయతో నీకు అంటగట్టిన హెచ్చు తగ్గుల కుల తత్వాన్ని సహోదర ప్రేమతో సమాధి చేయాలి: క్రీస్తు ప్రేమలో క్రీస్తుతో కలిసి జీవించాలి. అప్పుడుగాని నీవు క్రైస్తవుడవు కాజాలవు. ఇందుకు "లోకము మిమ్మును ద్వేషించినయెడల ఆశ్చర్య

పవిత్రుడు; మనము సహోదరులను ప్రేమించుచున్నాము. గనుక మరణములో నుండి జీవములోనికి దాటియున్నాము" (1 యోహా 3:13-14).

క్రైస్తవేతర కులవ్యవస్థకు క్రీస్తు సంఘములో స్థానమునిచ్చి, దానిని గౌరవంగా పోషించుట ప్రభువు ప్రేమను పరిహసించి దేవుని కృపను తృణీకరించుట కాదా? "చిన్న పిల్లలారా మాటతోను నాలుకతోను కాక క్రియతోను సత్యముతోను ప్రేమింతము". నశించిన దానిని వెదకి రక్షించుటకు వచ్చిన క్రీస్తు ప్రేమను మన అనుభవములో అమర్చుకొందము. మూర్ఖులైన మతాంధుల మూఢ సిద్ధాంతాలలో మునిగి మూల్గుచున్న మానవులకు క్రీస్తు కృపను చాటి చెప్పుదము. మనస్థాయి రేఖకు దిగువనున్న వారికి చేయూతనిచ్చి క్రీస్తు ప్రేమను వారికి పంచుదము.

— పాల్ గూటం, గొల్లవిల్లి-533 222.

—o—

# సంక్షిప్త వార్తలు

సోదరులు బెయిలీ గారికి గుండెపోటు వచ్చి రెండు వారాలకు పైగా ఆసుపత్రిలో యుండి 14-9-91 శనివారం మరల తమ యింటికి చేరుకొన్నారు. ఆయనకు కలిగిన ఈ రుగ్మత వలనను, సెప్టెంబరు 13వ తేదీ నాటికి 88 సంవత్సరములు నిండినందునను ఆయన చాల బలహీనులై యున్నారు. ఇండియా నుండి వెళ్లే ఉత్తరములకు ఇక జవాబీయలేని పరిస్థితిలో యున్నారు. అందువలన మీ ఉత్తరములు, విన్నపములు రేటవున్ పెద్దలకే నేరుగా పంపమని ఆయన కోరియున్నారు. బెయిలీగారి యొక్కయు ఆయన సతీమణి యొక్కయు ఆరోగ్యము కొరకు ప్రార్థించండి. ఆయన ప్రారంభించిన పని క్రీస్తు మరల వచ్చువరకు ఇండియాలో కొనసాగునట్లు కృషిచేయండి.

* * *

డెల్టా ప్రాంతమందు 1964 లో దేవుని పని ప్రారంభింపబడి దిన దినాభివృద్ధి నొందుచూ ఆయన రాజ్యము నలుమూలలకు విస్తరించుచున్నది. అనేక ప్రియ సోదరుల శ్రమ, త్యాగముల ఫలితంగా డెల్టాలోని క్రీస్తు సంఘము కూడ డెల్టా ప్రాంతమువలె సస్యశ్యామలంగా దేవుని మహిమార్థమై విరాజిల్లు చున్నది. పూత పట్టిన ద్రాక్ష తోటలను చెరుపుటకై జరిగే ప్రయత్నాలు ఘోరంగా విఫలమౌ చున్నాయి.

ఇంత వరకు జరిగిన సువార్తికుల సమావేశాల్లో మరియు సువార్త కూటాలలో అనేక ప్రాంతాలలో నూతనంగా పని ప్రారంభింప బడుటయే గాక స్థానికంగా నున్న క్రీస్తు సంఘములు క్షేమాభివృద్ధి నొందుచున్నవి. 1991 జనవరి నెలనుండి ఈ కూటాలలో 39 మంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిరి. సువార్తికుల మధ్య ప్రేమ, ఐక్యత, పనియందు ఆసక్తి, పరస్పర సహకారము పెంపొందు చున్నవి.

సెప్టెంబరు నెల సువార్తికుల సమావేశము 24వ తేదీ మంగళవారం శొంపిగుంటలో జరిగెను. "సత్యవాక్యము సరిగ విభజించుట ఎట్లు?అను అంశము చర్చించబడెను. సత్యవాక్యమును సరిగా విభజింపవలసిన అవసరమును సోదరులు జాషువా గూటంగారు, పాల్ గూటంగారు, సి. హెచ్. జాన్‌బాబుగారు, ఇ. కె.వి. ప్రసాదరావుగారు మరియు యన్. ఏలీయా గారు వివరించిరి. ఆత్మీయ అభివృద్ధికి ఆటంకంగా తయారైన కపట సహోదరుల విషయమై జాగ్రత్త పడవలెనని హెచ్చరించిరి. ఇద్దరు పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిరి. సోదరులు బూల యోహాను గారు పల్లంకుర్రులో నూతనంగా నిర్మించుకొనిన గృహము సోదరులు పాల్ గూటంగారి ద్వారా ప్రవేశము జరిగెను. సోదరులు జాషువా గూటంగారు ఈ సందర్భమున దేవుని వాక్యమును అందించిరి.

కొప్పిగుంటలో జరిగిన రాత్రి కూటమునకు సుమారు 200 మంది హాజరై రక్షణ సందేశమును వినిరి. బ్రదర్ జాషువా గూటం గారు తన శైలిలో "ఇదే రక్షణ దినము" అను అంశముపై గంభీర ముగ సువార్త ప్రకటించిరి. ఈ సందేశము అనేక హృదయములను కదిలించెను. కూటము పూర్తియగు వరకు వాతావరణము మిక్కిలి అనుకూలముగా నున్నందున అనేకులు రక్షణ మార్గము వినుటకు అవకాశము కలిగెను.

స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ (కాకినాడ) లో 2 సంవత్సరములు తర్ఫీదు పొందిన సోదరుడు బూల చిరంజీవి కొప్పిగుంటలో పనిచేయుచున్నారు.

పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట ఏరియా సువార్తికుల సమా వేశము సెప్టెంబరు 2వ తేదీ సోమవారంనాడు ఆచంటలో జరిగింది. కరుగోరుమిల్లి సువార్తికులు N. మోషేగారి ప్రార్థనతో ఆరంభమై కూటము ఆశీర్వాదకరముగా జరిగెను. సోదరులు P. సామ్యేలు, N. మోషే, G. సూర్యప్రకాశరావు, M. జోసఫ్‌గారు, K. ప్రసాద రావు, D. శ్రీరాములుగార్లు వాక్యము నందించి సోదరులను బల పర్చిరి. ఈ కూటమునకు పరిసర ప్రాంతముల సువార్తికులు హాజరై ఒకరికొకరు ప్రోత్సాహభరితులైరి. అక్టోబరు నెల సువార్తికుల సమా వేశము పెనుమంచిలి క్రీస్తు సంఘ ఆవరణలో జరుపబడును.

## కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్

వేసవి సెలవుల అనంతరము కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ జూన్ 27వ తేదీన తెరువబడి మూడు నెలలపాటు నిర్విరామముగా పనిచేసిన పిమ్మట ప్రస్తుతము సెలవుల నిమిత్తము మూయబడినది. ఈ ట్రైమిస్టర్‌లో 35 మంది విద్యార్థులు అత్యాశక్తితో బైబిలు తర్ఫీతును పొందిరి. సెలవుల అనంతరము అక్టోబరు 18వ తేదీన స్కూలు పునఃప్రారంభమగును. 2 సం॥ల తర్ఫీతుపొందు విద్యార్థులకు నెలకు రు 50/- చొప్పున స్టయిఫండు ఇవ్వబడుచున్నది. ఈ కోర్సులో సీట్లు పరిమితముగా గలవు గాన ఆసక్తి గలవారు వెంటనే మాకు వ్రాయండి.

ముఖ్య గమనిక :- కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ ద్వారా ప్రతీ సంవత్సరము నిర్వహింపబడుచున్న బైబిలు సెమినార్ ఈ సంవత్సరము కూడ డిశంబరు నెలలో జరుగును. సహో. పెర్రి కోతమ్‌గారు అత్యాసక్తి కరమగు ఆత్మీయ పాఠముల నందించుటకు సన్నద్ధులగుచున్నారు. ఈ బైబిలు సెమినార్ నిర్వహణ వ్యయములో స్థానిక సంఘములు, వివిధ క్రైస్తవ సోదర, సోదరీలు పాలుపంచుకొనవలసినదిగా కోరుచున్నాము. ఇప్పటికే వస్తురూపేణ, ధనరూపేణ యిచ్చుటకు కొన్ని స్థానిక సంఘములు ముందుకు వచ్చినవి. వివరములకు నెహెమ్యా గూటం (డైరెక్టరు) గారిని సంప్రదించండి:

అడ్రసు: కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్,
శేషగిరిరావు వీధి,
రామారావుపేట, కాకినాడ - 533 004.

---

Regd. No. H.KD—45 KD.H.O.

*From*
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA 533 001

No.

To
..............................
..............................
..............................
..............................